
# రక్తంలో వర్తకం



అవసరాల రామకృష్ణారావు

‘ఇప్పుడు జరుగుతున్న మన పెళ్ళిళ్ళ పద్ధతి చూస్తూంటే మనసున్న ఎవడికైనా వేదన కలుగుతుంది. ఇంకొకరికి ఇబ్బంది లేకుండా “సింపుల్‌గా, హాయిగా ఈ వేడుక జరిగే మంచిరోజు ఎప్పుడొస్తుందో!’ ‘మీ కా భయం లేదు...కనుచూపుమేరలో అలా జరిగే అవకాశం లేదు!’ పై అభిప్రాయం వెలిబుచ్చిన నడివయస్సు ఇల్లాలి పేరు సావిత్రి. ఆవిడకు జవాబు చెప్పిన స్టూడెంటు పేరు రామ్మూర్తి. వాళ్ళిద్దరూ ఎలాటి బంధువులూ కాకపోయినా, ఒకరికొకరు ఏమీ కారని మాత్రం చెప్పడానికి లేదు. ఒకే దిక్కున పయనిస్తున్న రైలు ప్రయాణీకులు వాళ్ళు. ఎదుటివారి హోదా, సెక్సూ, వయసూ పక్కకి నెట్టి సాటి మనిషితో గుండె విప్పి పరచగల నిండుమనుషులు వాళ్ళు. అది బజారు మధ్యలో అవనీండి, కిక్కిరిసిన రైల్వే కంపార్టుమెంటు అవనీండి...వారి అభిప్రాయాలు ఒకరు వినేస్తారేమో, ఏమైనా అనుకుంటారో ఏమో—ఇలాంటి సందేహాలూ, సంకోచాలూ వారు దరిదాపులకి రానివ్వరు. మన కబుర్లు మరొకరికి డిస్టర్బింగ్‌గా ఉంటాయేమో అనే చింతకూడా అలాంటివాళ్ళకి ఉండదు.

జీవితయానం లాగే రైలు ప్రయాణం కూడా రోజు రోజుకీ దుర్భరంగా తయారవుతోంది. అలాంటి దిక్కుమాలిన అవస్థలో ఉన్న ఆనాటి పాసెంజర్లకి ఇంచుమించు అందరికీ అనుభవమైన ఈ పెళ్ళిళ్ళ కబుర్ల చర్చ కాస్తో కూస్తో ఊరట కలిగించింది. అప్రయత్నంగా ఒకరి తర్వాత ఒకరు అందులో పాల్గొనడంతో అదొక రసవత్తర చర్చకు నాంది పలికింది. అందులో సుబ్బయ్యలాటివారు కలుగజేసుకోడం వినేవారికి విందు. ‘కుర్రాడయినా, ఆ అబ్బాయి చెప్పింది అక్షరాలా నిజం. నలుగురికీ చాటి చెప్పాలనీ, వీలయినంత ఆడంబరంగా చేసి తీరాలనీ ఎప్పుడైతే అనిపించిందో వివాహమనే పవిత్రబంధం మీద మనకి విశ్వాసం సడలిందేమో అని అనుమానించవలసి వస్తోంది. ఏనాడో రాసిపారేశాడు మహానుభావుడు ఆ గురజాడ—అగ్నిహోత్రావధానుల్ని కాబోలు అందులో “మూర్ఖపు ముండా కొడుకు” అని ఉదహరించినట్టు గుర్తు. ఇప్పుడు ఏ ఇంటి హెడ్ చూసినా ఇంచుమించు అలాంటివాడే! అలాంటి తాను చెప్పిందే వేదంగాళ్ళు నిర్వహించినంతకాలం పందిర్లో అనుభవమయేది సన్నాయిరాగం కాదు; సవాయి రోగం!’ ఆ మాటకి అంతా ఇంచుమించు నవ్వుల్లో పడ్డారు.

కాస్సేపు ఆగి ఓ బామ్మగారు అంది. ‘అన్నిటినీ అంత లోతుగా ఆలోచించి చెడువైపే చూసుకుంటే ఇక జీవితంలో వేడుకలు అంటూ ఏం ఉంటాయి? పెళ్ళంటే ఏమిటి! ఒకేసారి జరిగే శుభం. ఆ వేళప్పుడు ఎక్కడెక్కడివాళ్ళూ కలుస్తారు, కొత్త కొత్త సంబంధాలు కలవడానికి అవకాశం ఏర్పడుతుంది. దాని కేదో రోగమో రొష్టో, అని పేరు పెడితే మాలాంటివాళ్ళం ఊరుకోలేం సుమండీ!’

ఈసారి సావిత్రి జవాబు చెప్పింది. ‘పరిస్థితిని బట్టి పద్ధతి మార్చవలసి ఉంటుందని ప్రకృతిలోనే ఉన్నాయి పాఠాలు. మాటవరసకి మామిడిపండు రసం పీల్చుకోవాలంటే చేత్తో మృదువుగా నొక్కితే చాలు. అదే కొబ్బరి బొండాంలో నీరు తాగాలంటే ఆ రూలు పని చెయ్యదు. దాని తోలు ఒలిచేయాలి. పీచు రేగ్గొట్టాలి. అక్కడికేనా లొంగుతుందా? దాని బతుకు ముక్కలు చేస్తూ భళ్ళున బద్దలు కొట్టాలి. ఇదే అహింస అనుకుంటే ఇక ఏవిధమైన హిందూ పూజా

సంస్కారానికీ గతిలేదు. ఈ వివాహ వ్యవస్థ కేవలం రోగంతో పోల్చడం నా దృష్టిలో అతి మృదువైన వర్ణన. నలుగురూ కలుసుకోవడం అనేది ఏదైనా మంచి పనిని ప్రోత్సహించడానికైతే ఎవరైనా సంతోషిస్తారు. దొరికింది పట్టుకుపోదామని పెళ్ళి పందిట్లో చేరినవాళ్ళూ, పేకాటకోసమో, మందు పార్టీకోసమో ఆ సమయానికి మూగినవాళ్ళూ మినహాయిస్తే సాధారణంగా పెళ్ళికి రెండే రెండు ఉద్దేశాలతో బంధువులు హాజరవుతారు. కడుపునిండా తిందామని, కరువుతీరా తిట్టిపోదామనీ!'

ఈసారి చిన్నా పెద్దా చప్పట్లు కొట్టారు. అలా కొట్టినవారిలో వేరుశనక్కాయిల అప్పా, టీటీసీ కూడా ఉన్నారు. వాళ్ళుకూడా అందులో చేరిపోడం, "పెళ్ళంటే నూరేళ్ళ పంట" అనే నవల ఎంతో ఆసక్తితో చదువుతున్న ఓ అమ్మాయికి తల నొప్పి కలిగించింది. పుస్తకంలోంచి తల ఇవతలకి పెట్టి, తనకి కలిగిన ఇబ్బంది కొన్త ఘాటుగానే ప్రదర్శించింది.

'నల్ల కళ్ళజోడు పెట్టుకు చూస్తే తెల్ల వస్తువులయినా నల్లగానే కనపడతాయి. లోకంలో అంతా అంత హృదయంలేని వాళ్ళే ఉన్నారంటారా! రెండు దశాబ్దాల క్రితమూ, ఇప్పుడూ మనుషులు ఒక్కలాగే ఉన్నారా? నాగరికత కనీసం యువతనయినా సంస్కారుల్ని చెయ్యలే దనగలమా?!'

మాబాగా అడిగావు అన్నట్టు బామ్మగారు ఆమె భుజంమీద చెయ్యి వేసింది.

దీనికి రామ్మూర్తి జవాబు చెప్పాడు: 'ఎలా అనగలం? మాఅమ్మమ్మ కిరోసిన్ స్టవ్‌మీద వంట చేస్తే, మా అమ్మ గ్యాస్ స్టవ్‌మీద చేస్తోందంటే ఇదంతా నాగరికత కాదా! ఆ రోజుల్లో మాఎదురింటి పెళ్ళికాని పెద్దమ్మాయి కిరసనాయిలు పోసుకొని అంటించుకు చచ్చిపోయిందని మా దొడ్డమ్మ చెప్పేది. ఇప్పుడు కట్నాలో, కానుకలో అందించలేదని మొగుడూ, అత్తా కలిసి ఇంటి కోడల్ని గ్యాసు స్టవ్‌మీదకి సునాయాసంగా తోసేస్తున్నారు. ఇది మాత్రం ప్రగతి కాదా!'

కాస్సేపు భయంకర నిశ్శబ్దం ఆవరించింది వాతావరణంలో.

సుబ్బయ్యగారు ప్రశంసాపూర్వకంగా అతన్ని చూస్తూ—'నీకు పెళ్ళయిందా, బాబూ!' అని అడక్కుండా ఉండలేకపోయారు.

'నాకా యోగ్యత లేదండీ' అన్నాడు రామ్మూర్తి, తల దించుకొని.


మరుక్షణం అందరి కళ్ళూ అతనిమీదే ఉన్నాయి ఆశ్చర్యంతో. ఒడ్డూ పొడుగూ, తెలుపూ, చురుకూ ఇవన్నీ కలిసిన ఇతగాడు మగవాడు కాడా ఏం? ఇంతకీ ఆ సంగతి పబ్లిగ్గా రైల్వే కంపార్టుమెంటులో ఎవడైనా చెప్పుకుంటాడా? అయితే, అత నా సస్పెన్సు మరుక్షణం చెదరగొట్టేస్తూ—'నేనో నిరుద్యోగినండీ...నా పొట్టే నాకు భారం. ఆ వేటలోనే ఇది మరో ప్రయాణం' అన్నాడు.

'తన కాళ్ళమీద తను నిలబడందే మొగాడు పెళ్ళి చేసుకోకపోడం నిజంగా గొప్ప ఆదర్శం. ఆడదికూడా ఆ స్థాయికి ఎప్పుడెదుగుతుందో! అది సరేగాని, ఏమయ్యా, పెళ్ళి కాకుండానే దాని పుట్టు పూర్వోత్తరాలు చర్చిస్తున్నావ్, మీ ఇంట్లో..' అని సావిత్రి అడగబోతే...

'అవునండీ మీరు ఊహించింది కరక్టే! నాకు పెళ్ళికావలసిన ఓ అక్కా, ఓ చెల్లీ ఉన్నారు. పెద్దక్కకి పెళ్ళయిం దనుకోండి. అందులో చేదు అనుభవమే ఈ పెళ్ళి పద్ధతులు వేడుకలా, లేక ఇదంతా ఓ పీడకలా అనిపించింది నాకూ, మా అన్నకీ. అందుకే ఇలాంటి అన్ని రకాల అసందర్భాలకూ అతీతంగా తన పెళ్ళి జరిగేటట్టు ప్రయత్నించాడు మాఅన్నయ్య. నాన్నగారు కూడా చాలావరకు సహకరించారు. మాఅన్నయ్యకోసం మా ఇంటికి వచ్చిన కన్యాదాతలకి మాబాళ్ళు చెప్పిన విషయాలు ఇవి. 1. మాకు కట్నాలు వద్దు. 2. లాంఛనాలు వద్దు. 3. మేం జాతకాలు చూడం. మాకు కావలసినవి అమ్మాయి విద్యా, ఆరోగ్యమూ. పెళ్ళిచూపులు అంటూ ఉండవు. వధూవరులకి ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవడానికి ఏ పాచి ఒడ్డునో కనీసం ఓ గంట ఏకాంతం కల్పించాలి. ఎమ్మెస్సీ పాసయి లెక్చరరుగా ఉండి అందం, ఆరోగ్యం ఉన్న మా అన్నయ్యకి కేవలం నలుగురూ నడచే దారిలో నడవని నేరానికి శిక్షగా ఓ పట్టాన పెళ్ళవలేదంటే ఎవరూ నమ్మరు మరి. ఇంతకీ వధువు స్థిరపడ్డాక కూడా మాకు తోచిన మంచి ఆచరణలో పెట్టాలంటే ఎన్ని ఇబ్బందులు! "మీరు [illegible]సిన పాలు ఆ పాము నోట్లో పడవర్రా మొర్రో!" అని మొత్తుకున్నా పోస్టు—గ్రాడ్యుయేటు చేసిన విదుషీమణులైనా నాగుల చవితికి నాగన్న పుట్టదిక్కుకి నడుంకట్టడానికి సందేహించరు. అలాంటిది పదిమందికి బాధకలిగే పద్ధతి ఒకటి కొన్త మార్చుదామంటే "వీళ్ళ కేదైనా బుర్ర పాడైందేమో" అని ప్రతీవాళ్ళకీ అనుమానమే! ఇంతకీ అన్నయ్యని నే నెంత సపోర్టు చేసినా, పెళ్ళికూతురు తల్లిదండ్రులతో పాటు మా అమ్మా నాన్నా కూడా రిజిస్టర్డు మారేజికి ఒప్పుకోందే!'

'మన దేం నాస్తిక మతమా ఏమిటి, అబ్బాయీ?' అని అడిగింది బామ్మ.

'స్వార్థమూ, కసాయితనమూ పెరిగిన లోకంలో నలుగురి మంచికోసం ఆలోచించే ప్రతి మనసున్నవాడూ నాస్తికుడే నండీ! అవతలివాళ్ళ ఖర్చూ, శ్రమా తగ్గించే మంచి పద్ధతిగా అది సూచించాం గాని, దేవుడి గుళ్ళో దండలు మార్చుకునే పద్ధతి అయినా మాకు ఇష్టమే! మామాటలు విన్న దెవరు! ఓ పిల్లకి పెళ్ళిచేసి, ఇంకో ఇద్దరు ఆడపిల్లలు పెళ్ళి కెదిగి ఉన్న మాఅమ్మా నాన్నలకి—వాళ్ళు పుచ్చుకోవలసింది మానుకున్నారు గాని, ఎన్నిట్లోనో రాజీలకి దిగవలసివచ్చి చేతిచమురు భాగవతం మిగిలింది. అన్నయ్య పెళ్ళి అయేసరికి ఆరు వేలు అప్పు మిగిలిందని మేమంటే దగ్గిరవాళ్ళయినా నమ్మలేదు సరికదా—"ఇంత పుచ్చుకున్నామని ఎవరైనా చెప్తారా ఏమిటి! దొడ్డిదారిన ఏ లక్షో తోలించుకునే ఉంటారు" అని నిర్ధారణ చేశారు కూడా. పోనీ తక్కిన వాళ్ళందరూ గంగలో కలవనీండి, మాఇంటి కొచ్చిన కోడలయినా మా మంచితనం గ్రహించిందా? ఊహుఁ కల్చరులేని పెద్ద చదువులవల్ల ఎంత అనర్థం వాటిల్లుతుందో ఆవిడ మాటల వల్ల గ్రహించవచ్చు. వచ్చిందగ్గిర్నుంచీ ఒకటే రుసరుస. అన్నయ్య చెవిలో అందరికీ వినపడేలా ఒకటే గుసగుస. "మీవాళ్ళలా



అత్తెసరు బతుకులుతో నరిపోలవే మావాళ్ళ అంతస్థులు! మాఅక్కల పెళ్ళిళ్ళలో ఇలా ఏ కానుకయినా అడిగితే చాలు...అలా నిముషాలమీద నిండిపోయేది, ఎంత ఖరీదైన నరుకైనానరే. అడగందే అమ్మయినా పెట్టదే—ఇల్లు ధనలక్ష్మితో ఏం కళకళలాడిపోతోందని లేనిపోని గొప్పలకి పోయారు? కారూ, ఫ్రిజ్జీ మాట అలా ఉంచి, ఇంటి మొత్తంమీద బరుకూ బరుకూ తిరుగుతూ ఒకే ఒక్క టేబిల్ ఫానా! మీరంతా ఎలా బతుకుతున్నారని, ఏం చూసి నన్నిక్కడ ఉండమన్నారని!" అంటూ మొదలెట్టింది. మరి మొట్టమొదట పార్కులో అన్నయ్యతో మాటాడినప్పుడు అతని పెర్సనాలిటీ చూసి ఇలాంటివన్నీ పట్టించుకోలేదు కాబోలు. ఇంతకీ ఈ ఆదర్శ వివాహం చేసి అప్పులపాలైన మానాన్నగారికి ఆఖరికి మా అన్నయ్యకూడా మిగల్లేదు!'

'అంటే?' అన్నారు అందరూ తెల్లబోయి.

'ఆర్నెల్లలో మావదిన అన్నయ్యని పూర్తిగా మార్చేసింది. ఇప్పుడు అన్నయ్య మాదగ్గర్లేడు. లెక్చరరు ఉద్యోగానికి రిజైను చేసి రత్లాల్లయింది. వాళ్ళ మామగారి ఊళ్ళో, ఆయన పెట్టుబడితో మెడికల్‌షాపు పెట్టుకున్నాడు. ఎప్పుడైనా ఓ కార్డుముక్క రాస్తాడు—అదీ రాయనివాళ్ళకంటె నయమే కదా!' అని ముగించాడు రామ్మూర్తి.

'అయినా, ఏమనుకుంటే అనుకోగాని, అబ్బాయా, కుర్రాళ్ళేవో అవీ ఇవీ చదివి మీ అన్నదమ్ములు పెడమార్గం పట్టి మీ నాన్నకేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు నూరిపోశారే అనుకో! అంత వయసొచ్చి అయిదుగుర్ని కన్నాడు కదా మీ నాన్నకయినా ఉండొద్దుటయ్యా... బుద్ధి! బంగారం లాంటి కుర్రాడివి—అలా కాళ్ళు కడిగి ఇలా లక్షలతో ముంచెత్తుతారు. నువ్వయినా తొందరపడక ముందు జాగ్రత్తపడు, నాయనా! రేప్పొద్దుట నీ కడుపునా ఆడపిల్లలు పుడితే వాళ్ళనీ సాగనంపాలా మరి!'

వస్తున్న నవ్వుని అవుకుంటూ దీనికి సావిత్రి ఏదో జవాబు చెప్పబోతే వారించి, సుబ్బయ్యగారు ఆ బాధ్యత తనే తీసుకుని ఇలా అన్నారు: 'అలాగేనండీ, అలాగే చేస్తాడు ఈ అబ్బాయి. కాకుల్ని కొట్టి గద్దలకి వేస్తాడు! పెళ్ళనేది వేడుకగా మొదలై, వ్యవహారంగా రూపుదిద్దుకుని, వ్యాపారంగా నిలబెట్టేలా చేశాం కదా మన మందరం. ఎదురుగుండా కనబడి మీకు తోచిన అభిప్రాయాన్ని నదురూ బెదురూ లేకుండా, నడుస్తున్న రైలు చప్పుడుని మించిన స్వరంతో చెప్పగలిగిన మీలంటి ఆడవాళ్ళని అనుకోవడం దేనికి—పట్టు చీరలకీ, బంగారు నగలకీ ఎగబడతారని! మిమ్మల్ని ఇలా ఆలోచించేలా తయారుచేసిన బాధ్యత మా మొగాళ్ళదే. మీవి పైకి కనబడే ఆడాంబరాలు. మటి పచ్చని ఇళ్ళు పడగొట్టే గుప్త వ్యసనాలు. ఎవరికైనా, దేనికైనా డబ్బు కావాలి. అదీ తప్పని అవసరం గనక దానిని సంపాదించడానికి ఏ దారి తొక్కినా సిగ్గుపడడంలేదు మనిషి. పైగా దానికి సంఘం ఆమోదముద్ర కూడా. "అమ్మా, ఆకలి" అనే వీథిలో బిచ్చగాణ్ణి చీదరించుకునే మనమే ఇంత కట్నం కావాలి అనే ఇంకొక రకం ముష్టిని పబ్లిగ్గా ప్రోత్సహిస్తున్నాం. ఎదిగిన ఆడపిల్లా, మగవాడూ మన సిచ్చిపుచ్చుకొనే పరిస్థితులకి ఎటువంటి అవకాశమూ కల్పించక, మన పెద్దలం—ఆడపెళ్ళివారం, మగపెళ్ళివారం—లావాదేవీలకు దిగజారిపోయే డబ్బు సంబంధాలనే పెంచి పోషిస్తున్నాం. మీ రెవరేమనుకున్నా సరే, ఆఖర్న నా మాటగా ఒక్కటి చెప్పక మానను. పెళ్ళి ఎక్కడ ఎంత గొప్పగా జరిగితే నాకంత ఎక్కువ ఏడుపు వస్తుంది! గోధుంరాయి పెట్టడం మొదలు పదహారు రోజుల పండుగదాకా అంతా ఎంతో సిల్లీగా, సిగ్గుచేటుగా కనబడుతోంది ఇవాళ నాకు! కట్నమూ, లాంఛనాలూ, పెళ్ళి ఖర్చూ అన్నీ కలిపి కనీసం ఏభై వేలు దాటుతుంటే ఇద్దరు ముగ్గురున్న మధ్య తరగతి గృహస్థు ఎవర్ని కొట్టి ఎలా తెస్తున్నాడో, ఏం తింటున్నాడో, ఎలా నిద్దరపోతున్నాడో! ఎదురింట్లో పాము జొరపడితే తనకి చీమయినా కుట్టనట్టు ప్రవర్తించే ఈ దౌర్భాగ్య స్థితి ఈ దేశంలోంచి ఎప్పుడు పోతుందో! ఏ సర్వసమానత్వ వ్యవస్థో వచ్చేదాకా, ఏ పదకొండో అవతారమో ఎత్తబడేదాకా వీ ళ్ళిలా అఘోరించవలసిందేనా? అందాకా ఇంటింటా పెళ్ళికాని వృద్ధ కన్యలా! పోనీ నూటి కొకర్తికి అయిందనుకుంటే...పసుపు బట్టల్తోనే ఆత్మహత్యలా!!' ★

# తెలుగు రుబాయీలు-3

## డాక్టర్ దాశరథి

పరబ్రహ్మ చెక్కినాడు అందాల బొమ్మను
  సురలోకాంగనల కళ్ళు కుట్టించే కొమ్మను;
కవితా సుస్నేహమొసగి కాపాడుకుంటాను
  సౌందర్య జ్వాలలతో వెలిగే ఈ సెమ్మెను

చెలియ పలుకు పలికిందా? ఇంకెందుకు నీణలు?
ఆమెముందు బలాదూరు సురలోకపు జాణలు;
విరబూసిన గుల్‌మొహరు తరువులాంటి మామాభా
రమ్మన్నది; వెళతా; న న్నాపలేవు జడివానలు



దాడిమీ బీజారుణ దరహసితాధరము
ధరణీధర శిఖరాయిత వరమోన్నతమురము
నన్ను తాకి నరనరాల పులకింతల పొంగించే
అంగన కోమల కరము అతి మంగళకరము

వల్కలాన ఉరోజాలు బంధించేవు
క్రేగంటను బాణాలను సంధించేవు
ఓడిపోయి లొంగిపోదు ననుకున్నావా?
నా గెలుపును చూచి నన్ను నిందించేవు

నీ నిందను స్తుతిగానే భావిస్తాను
నిరాశలను పారద్రోలి జీవిస్తాను
అలకతోటి అతిదూరం పోయేదానా!
ఒక్క త్రుటిలో నిన్ను నేను సాధిస్తాను

దోసిటిలో నీళ్ళవంటి నీ యౌవనము
దాచి దాచి ఉంచాలని ఏల జతనము?
దప్పిగొన్న నన్నువంటి బాటసారి కివ్వు
సార్థకమవుతుంది చెలీ! నీ జీవనము!